



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 12.01.2026 | సంపుటి : 2 | సంచిక :337 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 12.01.2026 | volume : 2 | Issue : 337 | Pages : 8 | Cost : 2/- |




## మేడారం మహా జాతరను విజయవంతం చేస్తాం

**వనదేవతల వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

ములుగు : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరను విజయవంతంగా నిర్వహించి వనదేవతలు సమ్మక్క, సారలమ్మల వైభవాన్ని ప్రపంచానికి చాటుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లు, గద్దెల పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు -మిగతా 2 లో..

# దేశ అభివృద్ధిలో పాలుపంచుకోండి

**భారత్‌లో వ్యాపార ప్రగతికి అద్భుతమైన అవకాశాలు**

**ప్రపంచమంతటా అస్థిర పరిస్థితులు.. మన దగ్గర రాజకీయ స్థిరత్వం**

**పారిశ్రామికవేత్తలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**

**ప్రపంచమంతటా అస్థిర పరిస్థితు లు, ఉద్రిక్తతలు కొనసాగుతుండ గా, భారత్ లో మాత్రం గతంలో ఎన్నడూ లేనంత రాజకీయ స్థిరత్వం ఉన్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. దేశంలో వ్యాపార ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయ ని పేర్కొన్నారు. ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.**



రాజ్‌కోట్ : భారత్‌లో పెట్టుబడులకు పూర్తి సానుకూల వాతావరణం ఉందన్నారు. ఆదివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో వైబ్రాంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. భారత ఆర్థిక వ్యవస్థ నేడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారడం తథ్యమని ధీమా -మిగతా 2 లో..



## అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు

**మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన పునఃప్రారంభ పనులు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు.**

హైదరాబాద్: తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారు. మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు -మిగతా 2 లో..



## నిరుద్యోగుల గురించి పట్టింపేది?

**దుస్తుల షాపుల ప్రారంభోత్సవాలకు వెళ్లే సీఎంకు నిరుద్యోగుల వద్దకు వెళ్లే తీరిక లేదా..?**

**దయనీయ పరిస్థితిలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు**

**పురపోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం గత 24 నెలలుగా అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలతప్రేమ్‌గౌడ్ -మిగతా 2 లో..

## స్వాహా సొమ్మును వసూలు చేస్తాం

**భూ భారతి పోర్టల్‌లో అక్రమాలపై సమగ్ర విచారణ**

**ఇందు కోసం ఉన్నతస్థాయి కమిటీ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ**



హైదరాబాద్: భూ భారతి పోర్టల్‌లో వెలుగుచూసిన అక్రమాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి (హైలెవల్) కమిటీని ఏర్పాటు చేసింది. ఐఐటీ ముంబయి నిపుణుడు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యదర్శి మంద మకరంద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ... పలువురు నిపుణులను కమిటీకి సహాయకారులుగా నియమిస్తూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి -మిగతా 2 లో..



## ముఠాగా ఏర్పడి.. కోట్లు కొల్లగొట్టి..

**సత్తుపల్లికి చెందిన సైబర్ క్రైమ్ ముఠా రూ.547 కోట్ల లావాదేవీలు..**

**24 మందిపై కేసు నమోదు.. 18 మంది అరెస్ట్**

**వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా రూ.547 కోట్ల లావాదేవీలు జరిపిన సైబర్ క్రైమ్ ముఠా గుట్టును ఖమ్మం జిల్లా పోలీసులు రట్టు చేశారు. అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తున్న సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ముఠా పట్టుబడినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు.**

ఖమ్మం : వీఎం బంజరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. మ్యాట్రిమోనీ, రివార్డ్ పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ -మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82



## యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట : సంక్రాంతి సెలవుల నేపథ్యంలో యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని పలు జిల్లాలు, ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో యాద్రాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదాల కొనుగోలు క్యూలైన్ల వద్ద భక్తులు బారులు తీరారు. కల్యాణ కట్ట, పుష్కరిణి, ఆలయ పరిసరాలు, యాత్రికుల వాహనాలతో పార్కింగ్ స్థలాలు కిక్కిరిసిపోయాయి.



## పట్నం టు పల్లెబాట

సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నివసించే చాలామంది తమ సొంతూళ్లకు వెళ్లడంతో ఒకవైపు నగరంలోని ప్రధాన రహదారులన్నీ వెలవెలబోతుండగా.. మరోవైపు హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. శనివారం యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా మీదుగా 71,284 వాహనాలు రాకపోకలు సాగించాయి. ఇందులో విజయవాడ వైపు ఆదివారం సాయంత్రం వరకు 47,560 వాహనాలు ప్రయాణించాయి. కీసర టోల్‌ప్లాజా వద్ద గంటకు సగటున 1,917 వాహనాలు వెళ్లాయి. సచివాలయం, తెలంగాణతల్లి ఫ్లైఓవర్, ట్యాంక్‌బండ్ నిర్మానుష్యంగా కనిపించాయి.

## భూ మాఫియాకు కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తోంది

### ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్:** రాష్ట్రంలో రోజురోజుకు భూ మాఫియా రెచ్చిపోతుందని, వారికి అన్ని విధాలా కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలా వెంచర్‌లో శనివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడ్డ వారిని ఆయన ఆదివారం పరామర్శించారు. అనంతరం ఏకశిల వెంచర్‌ను సందర్శించి ఇంటి స్థల యజమానులతో మాట్లాడి దాడి జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. 1985లో 146 ఎకరాల్లో 2086 ఇంటి స్థలాలను చిన్నచిన్న ఉద్యోగులు కొనుగోలు చేశారని తెలిపారు. భూ మాఫియా లీడర్ వెంకటేశ్ రెవెన్యూ రికార్డుల్లో ఉండే లొసుగులను ఆసరా చేసుకొని, రెవెన్యూ విభాగంలోని అవినీతి అధికారులు, భూమి యజమానితో కలిసి ఏకశిలా వెంచర్‌లో 47 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. డబ్బులకు ఆశపడి అప్పటి రెవెన్యూ అధికారులు గుండాలకు మద్దతిచ్చారన్నారు. సింగరేణిలో ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, కూరగాయలు, పాలు అమ్ముకొనే వారు ఇక్కడి స్థలాలను కొనుగోలు చేశారన్నారు. వారిని బెదిరించి స్థలాలను కాజేయాలని వెంకటేశ్ చూస్తున్నాడని, ఇది ముమ్మాటికి సాగదని స్పష్టం చేశారు. పోలీసులు ఉన్నది చట్టాన్ని కాపాడటానికి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి.. గుండాల మీద ఉక్కు పాదం మోపడానికి లా అండ్ ఆర్డర్ కాపాడటానికి.. కానీ భూ మాఫియాకు పూర్తిగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.

## ముఠాగా ఏర్పడి.. కోట్లు కొల్లగొట్టి..

(మొదటిపేజీ తరువాయి)



మార్కెట్‌లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో నిందితులు మోసగించినట్టు పోలీసులు గుర్తించారు. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పోట్రు మనోజ్ కల్యాణ్, ఉడతలేని వికాస్ చౌదరి, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రియ, మేడ సతీష్, మారంపూడి చెన్నకేశవతో పాటు మరో 11 మందిని అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తానని పోట్రు కల్యాణ్, ప్రవీణ్, ఉడతనేని వికాస్ చౌదరితో పాటు మోరంపూడి చెన్నకేశవులు.. తనను నమ్మించి మోసం చేశారని గతేడాది డిసెంబరు 24న సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు బ్యాంకులలో ఖాతా తెరిపించి అకౌంట్లకు సంబంధించిన వివరాలు, ఏటీఎం కార్డు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు తెలిసిందని పోలీసుల దృష్టికి తెచ్చాడు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా నిందితులు రూ.547 కోట్ల లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. సత్తుపల్లి, వేంసూర్, లింగపాలెం, సదాశివుడు పాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన మరో ఆరుగురు పేరిట ఖాతాలు తెరిచి వారికి రూ.5వేలు, కరెంట్ అకౌంట్ అయితే రూ.10వేలు ఇచ్చి ఏజెంట్ల ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించారు. అనంతరం ఆ ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగించుకొన్నారని సీపీ వివరించారు. నేరస్థుల బ్యాంక్ అకౌంట్‌లపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో వందల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయని తెలిపారు.

## స్వాహా సొమ్మును వసూలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్ఐసీ, సాఫ్ట్‌వేర్‌పై పట్టున్న టెకీలు, పలువురు ఐఏఎస్ అధికారులకు ఇందులో స్థానం కల్పించారు. భూ భారతితోపాటు స్టాంపులు– రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్ 'కార్డ్'లోనూ అక్రమాలపై ఈ కమిటీ విచారణ చేయాలని మంత్రి ఆదేశించారు.

### స్వాహా సొమ్మును వసూలు చేస్తాం: మంత్రి పొంగులేటి



పోర్టల్ వేదికగా ప్రభుత్వ సొమ్ము స్వాహాకు పాల్పడినవారిని వదిలేది లేదని, అణా పైసా సహా తిరిగి వసూలు చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, స్టాంపులశాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరంద్, ఎన్ఐసీ నిపుణులతో అత్యవసరంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. 'ఐదేళ్ల లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాం. 52 లక్షల లావాదేవీల్లో 4,800 ట్రాన్సాక్షన్లలో లోపాలను గుర్తించాం. రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో 3 వేలు బయటపడ్డాయి. వాటికి సంబంధించిన మొత్తం రికవరీకి ఆదేశించాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించిన ఆడిట్‌లో స్టాంప్ డ్యూటీ, చలానా మొత్తం పక్కదారి పట్టినట్లు గుర్తించాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడ్డారు. బాధ్యులను గుర్తించి విధుల నుంచి తొలగించడమే కాకుండా పీడీ చట్టం ప్రయోగిస్తాం. రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా, లేదా అన్నది కూడా విచారణలో తేలుతుంది. ఉంటే ఎవరినీ వదిలిపెట్టం" అని పేర్కొన్నారు.



## దేశ అభివృద్ధిలో పాలుపంచుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తంచేశారు. దేశ ప్రగతిలో గుజరాత్ కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. భారత్ పట్ల ప్రపంచ దేశాలు ఆకాంక్షలు నానాటికీ పెరుగుతున్నాయని, తాజా గణాంకాలు ఇదే విషయం స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. దేశంలో మధ్య తరగతి వర్గం వేగంగా విస్తరిస్తోందని, వారి కొనుగోలు శక్తి పెరుగుతోందని చెప్పారు. తద్వారా వ్యాపార అభివృద్ధికి అవకాశాలు సైతం అదే స్థాయిలో పెరుగుతు న్నాయని వెల్లడించారు. మొబైల్ డేటా వినియోగంలో భారత్ అగ్రస్థానంలో ఉందన్నారు. వైబ్రాంట్ గుజరాత్ సదస్సుకు దేశ విదేశీ పెట్టుబడిదారులు హాజరయ్యారు.



### మేడారంలో మహా జాతరను

## విజయవంతం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి ఆయన మేడారాన్ని సందర్శించారు. స్థానిక హరిత హోటల్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ రూ.251 కోట్లు వెచ్చించి గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. రెండ్రోజుల్లో పనులన్నీ పూర్తవుతాయన్నారు.

## 16 నుంచి సీఎం మున్సిపల్ ప్రచారం



**హైదరాబాద్:** సంక్రాంతి పండగ తరవాత మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పర్యటన ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా బహిరంగసభలో ప్రసంగిస్తారు. అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవంతో పాటు, చనాఖా–కోర్ట ప్రాజెక్టు సందర్శన, సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాలతోనే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి 3న జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభతో ప్రచారం ప్రారంభించాలని అనుకున్నా సమయం సరిపోదని.. అంతకన్నా ముందే జరపాలని తాజాగా నిర్ణయించారు. ఈ నెల 17న జడ్చర్ల లో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి, మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమా లకు సీఎం శంకుస్థాపన చేసి, ఇదే పట్టణంలో ఏర్పాటుచేసే బహిరం గసభలో ప్రసంగించనున్నారు. 18న పాలేరులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల అనంతరం ఖమ్మం పట్టణంలో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడే సీపీఐ వందేళ్ల సభలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం ములుగు జిల్లా మేడారం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారు. 19న ఉదయం 6.30 గంటలకు కొత్తగా నిర్మించిన సమ్మక్క–సారలమ్మ గద్దెలను సీఎం ప్రారంభించి మొక్కులు తీర్చుకుని హైదరాబాద్ చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం దావోస్‌కు బయలుదేరి వెళతారు. అక్కడినుంచి 25న అమెరికా వెళతారని తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన రేవంత్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు. ఒక్కోచోట లక్ష మందితో సభ: ఫిబ్రవరి 3 నుంచి మళ్లీ ఉమ్మడి జిల్లాల్లో వరసగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభలు ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలకు హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో ఒక్కోచోట లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలనేది కాంగ్రెస్ ప్రచార వ్యూహం. ఈ సభలను విజయవంతం చేయడానికి ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం లేదా ఒక ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ బాధ్యతలను ఒక్కో మంత్రికి అప్పగించాలని సీఎం ఇప్పటికే సూచించారు. ఈ మేరకు ఏ జిల్లాకు ఏ మంత్రి అనేది పార్టీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. లోక్‌సభ నియోజకవర్గాలకు కాకుండా.. ఉమ్మడి జిల్లాలకు ప్రస్తుతం ఇన్‌ఛార్జి మంత్రులుగా ఉన్నవారికే సభల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉన్నట్లు సమాచారం. పీసీసీ రూపొందించిన ప్రతిపాదనలపై ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన తరవాత మంత్రుల జాబితాను విడుదల చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం వార్డులు, ఛైర్మన్ పదవులు గెలవాలనే లక్ష్యంతో సభలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: డీజీపీ

**హైదరాబాద్:** రహదారి భద్రతలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపడమే 'అరైవ్.. అలైవ్' లక్ష్యమని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కృషి చేస్తున్నామని, పోలీసుశాఖలో ప్రతి ఒక్కరూ 'అరైవ్..ఎలైవ్'లో భాగం కావాలని ఆదేశించామని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్‌రూట్లో రావడం, అతివేగం వంటి ప్రమాదకర అలవాట్ల నివారణకు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నామని డీజీపీ వెల్లడించారు.



### అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ

## టన్నెల్ తవ్వకాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25శాతం అదనపు జీతాలు ఉంటాయని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందన్న మంత్రి.. ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని ప్రకటించారు.

## అత్యాచార ఆరోపణల కేసులో పాలక్కాడ్ ఎమ్మెల్యే అరెస్టు



**తిరువనంతపురం:** అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న పాలక్కాడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ మామ్‌కుటత్తిల్ అరెస్టయ్యారు. పాలక్కాడ్‌లోని ఓ హోటల్‌లో ఆయనను అరెస్టుచేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. తమను లైంగికంగా వేధిస్తున్నట్లు ఓ నటి, మరో యువతి గతంలో రాహుల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ కేసుల్లో ఆయన ముందస్తు బెయిల్ పొందారు. ఇటీవలే మరో యువతి అతడిపై పలు ఆరోపణలు చేసింది. 2024లో రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, గర్భం తొలగించుకోవాలని బెదిరించాడని ఫిర్యాదుచేసింది. తనను వివాహం చేసుకుం టానని నమ్మించి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపించింది. రాజకీయంగా పలుకుబడి ఉండటంతో ఇన్నాళ్లూ రాహుల్‌పై ఫిర్యాదు చేయలేదని, అతడిపై వంసగా అత్యాచార కేసుల నమోదు కావడంతో ఈ నెల 8న పోలీసులను ఆశ్రయించినట్లు యువతి పేర్కొంది. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న రాహుల్‌ని ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టుచేశారు. లైంగిక వేధింపుల వంసస ఆరోపణలతో పార్టీ నుంచి రాహుల్‌ను కాంగ్రెస్ ఇదివరకే బహిష్కరించింది. ఈ అరెస్టు విషయంలో జోక్యం చేసుకోబోమని, రాహుల్‌కు ఎటువంటి మద్దతు ఇవ్వబోమని పార్టీ సీనియర్ నేత కె.మురళీధరన్ మరోసారి స్పష్టంచేశారు. వైద్య పరీక్షల నిమిత్తం రాహుల్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ), యువ మోర్చాలకు చెందిన నిరసనకారులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరీక్షల అనంతరం రాహుల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

## సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**హైదరాబాద్:** ప్రకృతితో ముడిపడి ఉన్న పండగలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ముప్పవరపు ఫౌండేషన్ భవనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. సంబురాలు కనుల పండువగా జరిగాయి. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విభజన అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబుపై ఉందని అన్నారు. ట్రస్టు సేవలను కిషన్‌రెడ్డి ప్రస్తుతించారు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి అన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావు.. పండగల ఆవశ్యకతను వివరించారు. పని కల్పించాల్సిన శరీరానికి విశ్రాంతి, ప్రశాంతంగా ఉండాల్సిన మనసుకు పని కల్పించడం నేటి సమాజంలో సర్వసాధారణమైందన్నారు. మనసుకు విశ్రాంతి ఇస్తేనే సంపూర్ణ ఆరోగ్యమని అన్నారు. 700కుపైగా వేమన పద్యాల సీడీలను కార్యక్రమంలో ఆవిష్కరించారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నైపుణ్య శిక్షణ పొందిన యువతకు ధ్రువపత్రాలను అందజేశారు. నటుడు బ్రహ్మానందం, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, సుజనా చౌదరి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు, కేవీపీ రామచంద్రరావు, కామినేని శ్రీనివాస్, వెంకయ్యనాయుడు సతీమణి ఉష, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్, ట్రస్టీ అట్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## దళితులు ఆర్థికంగా బలోపేతమైతేనే వివక్ష నశిస్తుంది: మంత్రి వివేక్

**నిజామాబాద్ :** దళితులు ఆర్థికంగా బలోపేతం అయితేనే కులవివక్ష నశిస్తుందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాలలకు అన్యాయం జరగకుండా చూడాలనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన మాల సర్పంచులు, ఉపసర్పంచులకు నిజామాబాద్‌లో 'జిల్లా మాల మహానాడు' ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'మాలలకు కాంగ్రెస్ పార్టీ 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చేవెళ్ల డిక్లరేషన్‌లో పేర్కొంది. దీనిపై సంఘాలు సీఎం, పీసీసీ అధ్యక్షుడిని కలిసి వినతిపత్రాలు అందజేయాలి. ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలను సకాలంలో అందించాలి. నాలుగు శాతం వస్తువులను దళిత పారిశ్రామికవేత్తల నుంచి కొనుగోలు చేయాలనే చట్టాన్ని కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తోంది. తెలంగాణలోనూ దీనిని ఆచరణలోకి తేవాలి. కాంట్రాక్టులలో ప్రత్యేక రిజర్వేషన్ వర్తింపజేయాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా' అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఒప్పందం చేసుకోండి

## క్యూబాకు ట్రంప్ హెచ్చరిక

**క్యూబా :** క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అనేక సంవత్సరాలుగా ఆ దేశం డబ్బు, చమురు కోసం వెనెజువెలాపై ఆధారపడిందని పేర్కొన్నారు. ఇకపై ఆ దేశానికి ఎలాంటి చమురు గానీ, డబ్బు గానీ వెళ్లవని.. పరిస్థితి చేయి దాటిపోకముందే ఒక ఒప్పందానికి రావాలన్నారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. మరోవైపు.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో.. క్యూబా అధ్యక్షుడు అవుతారంటూ ఓ నెటిజన్ పెట్టిన ట్వీట్‌పైనా స్పందించారు. ఇది వినడానికి బాగుందన్నారు. "వెనెజువెలా నుంచి పెద్దమొత్తంలో అందిన చమురు, డబ్బుపై ఆధారపడి క్యూబా అనేక సంవత్సరాలు గడిపింది. దానికి ప్రతిఫలంగా.. ఇద్దరు వెనెజువెలా నియంతలకు భద్రతా సేవలు అందించింది. కానీ.. ఇకపై అలా జరగదు. ఇటీవల మేం నిర్వహించిన దాడిలో అనేక మంది క్యూబన్ భద్రతాధికారులు చనిపోయారు. వెనెజువెలాకు ఇకపై గూండాలు, దోపిడీదారుల రక్షణ అవసరం లేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యం వారికి అండగా ఉంది. క్యూబాకు చమురు, డబ్బులు కూడా అందవు. పరిస్థితి చేయి దాటిపోకముందే ఆ దేశం ఒక ఒప్పందానికి రావాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను బంధించి తీసుకొచ్చేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ సమయంలో క్యూబాకు చెందిన 32 మంది భద్రతాధికారులు మృతి చెందారు. ఈ దాడిని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియజ్- కెనల్ ఖండించారు. హవానాలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట వేలాది మంది పాల్గొన్న ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. క్యూబా చమురు అవసరాల్లో దాదాపు 30 శాతం వెనెజువెలా సరఫరా చేస్తుంది. ఇప్పటికే అస్థిరంగా ఉన్న క్యూబా విద్యుత్ వ్యవస్థ, ఇంధన సరఫరాలకు తాజా పరిణామం పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు.



# మొత్తం సమాజాన్నే నాశనం చేసే ప్రయత్నం

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**ఇరాన్ :** ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో ప్రజాగ్రహం తీవ్రరూపం దాల్చింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు వంద మందికిపైగా మృతి చెందారు. ఈ క్రమంలోనే దేశాధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లరి మూకలు మొత్తం సమాజాన్నే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నిరసనకారుల వాదనలు వినేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. "ప్రజల్లో ఆందోళన నెలకొన్న విషయం వాస్తవమే. మేం వారితో మాట్లాడాలి. వారి సమస్యలను పరిష్కరించడం మా కర్తవ్యం. కానీ, అంతకంటే ముఖ్యమైన పని ఏంటంటే.. అల్లరి మూకలు మొత్తం సమాజాన్ని నాశనం చేయకుండా చూడటమే" అని అధికారిక మీడియా ఇంటర్వ్యూలో పెజెష్కియాన్ తెలిపారు. అంతకుముందు పార్లమెంటు స్పీకర్ ఖలీబఫ్ మాట్లాడుతూ.. ఆందోళనకారులతో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. అరెస్టయిన వారిని శిక్షిస్తామన్నారు. ఇరాన్ కరెన్సీ విలువ పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో రెండు వారాలుగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించింది. మరోవైపు.. ఇరాన్ స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తోందని, వారికి సాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ పోస్టు చేశారు. దీన్ని ఇరాన్ ఖండించింది. ఒకవేళ తమపై అమెరికా దాడి చేస్తే.. ఆ దేశంతోపాటు ఇజ్రాయెల్ తమ లక్ష్యాలుగా మారతాయని హెచ్చరించింది.



# విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి లేఖలు

**హైదరాబాద్:** రాష్ట్రంలోని సుమారు 83 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేఖలు రాశారు. వాటిని విద్యుత్ అధికారులు స్వయంగా వెళ్లి వినియోగదారులకు అందజేస్తున్నారు. భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు.. విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు, డిప్యూటీ సీఎం సందేశంతో కూడిన లేఖలను గృహజ్యోతి లబ్ధిదారులు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అందజేస్తున్నారు. వినియోగదారుడి పేరు, సర్వీస్ కనెక్షన్ నంబర్‌తో వ్యక్తిగతంగా ప్రస్తావిస్తూ రాసిన ఈ లేఖలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు స్వయంగా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 52,82,498 మంది గృహజ్యోతి లబ్ధిదారులు, 30,03,813 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ లేఖలు ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు.

# 1000 ఏళ్ల తర్వాత కూడా సోమనాథ్ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉంది

## ప్రధాని మోదీ



**గుజరాత్ :** సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని ప్రధాని మోదీ అన్నారు. బానిస మనస్తత్వంతో దాని ప్రాముఖ్యతను విస్మరించారని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ పటేల్ చేసిన ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నాలను అడ్డుకున్నారని విమర్శించారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ధ్వజమెత్తారు. మూడు రోజుల గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సోమనాథ్‌పై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేశారని ప్రధాని అన్నారు. ఈ ఆలయం.. ధైర్యం, త్యాగాలు, దృఢసంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. 1000 సంవత్సరాల తర్వాత కూడా ఆలయంపై జెండా ఎగురుతూనే ఉందని, అది భారత దేశ స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతోందని వెల్లడించారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్.. భారతదేశ విశ్వాసానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ఆ స్వాభిమాన్ పర్వ్‌లో పాల్గొనడం ఒక గొప్ప జ్ఞాపకమన్నారు. ఆలయంపై దాడికి వెయ్యేళ్లయిన సందర్భంగా ప్రధాని మోదీ ఇటీవల ప్రత్యేక వ్యాసం రాసిన సంగతి తెలిసిందే. పుణ్యక్షేత్రంపై గజనీ మహమ్మద్ క్రూర, హింసాత్మక దండయాత్ర చేసింది 1026 జనవరిలోనేనని, ఆలయ పునరుద్ధరణ తర్వాత 1951 మే 11న ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షంలో ఆలయంలో భక్తులకు మళ్లీ దర్శనభాగ్యం కలిగిందని అందులో పేర్కొన్నారు. దాడి ప్రయత్నం జరిగిన ప్రతిసారీ ఆలయాన్ని కాపాడుకునేందుకు ప్రజలు దృఢంగా అడ్డుపడ్డారని, కొందరు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు.

# గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదు

## పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్వీట్



**హైదరాబాద్:** చైనా మాంజా జనం ప్రాణాలు తీస్తున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పతంగుల పండగ నేపథ్యంలో 'గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదు' అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు. చైనీస్ మాంజా దారం తెగదు.. కానీ మనుషుల మెడలు, పక్షుల రెక్కలు తెగ్గోస్తుంది. మీ క్షణికానందం.. మరొకరి ఇంట తీరని విషాదం కాకూడదు. నిషేధిత చైనా మాంజా అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. పండగని పండగలా జరుపుకోండి. ప్రాణాలు తీసి కాదు' అంటూ సజ్జనార్ హెచ్చరించారు. కాగా, చైనా మాంజా విక్రయంపై నగర పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. దీని వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2016లో, జాతీయ హరిత ట్రైబ్యునల్ 2017లో నిషేధించింది. అయినప్పటికీ విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దీంతో నెల రోజులుగా నిఘా ఉంచిన అధికారులు ఇప్పటి వరకు 103 కేసులు నమోదు చేసి, 143 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 1.24 కోట్ల విలువైన 6226 బాబిన్ల మాంజా స్వాధీనం చేసుకున్నారు. ఇవాళ హైదరాబాద్‌లో చైనా మాంజాకు మరో వ్యక్తి బలి అయ్యాడు. బైక్‌పై వెళ్తున్న సాయి వర్ధన్ మెడకు మాంజా చుట్టుకోవడంతో అతడి చెయ్యి, మెడకి తీవ్ర గాయమైంది. దీంతో, వెంటనే సాయి వర్ధన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో జరిగింది.

# మొన్న అల్లు అర్జున్.. ఇప్పుడు ప్రభాస్‌పై కక్ష

## హరీశ్‌రావు సంచలన కామెంట్




**హైదరాబాద్:** తెలుగు చిత్ర పరిశ్రమ పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పలు విమర్శలు చేశారు. సినిమా రంగం అనేది తమ రాజకీయ కక్షలను తీర్చుకునేందుకు ఒక అడ్డాగా మార్చుకున్నారని ఆయన భగ్గుమన్నారు. ఒక సినిమాకు టికెట్ ధరలు పెంచి మరో సినిమాకు పెంచకపోవడం ఏంటి అంటూ ఆయన ప్రశ్నించారు. ఒకవైపు టికెట్ ధరలు పెంచుతూ జీవో వస్తుంది. మరోవైపు ఆ శాఖకు బాధ్యత వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనకు తెలియదు.. ఆ జీఓ ఎలా వచ్చిందో అంటారు. అసలు తన దగ్గరికే ఫైల్ రాలేదని నిస్సహాయంగా చేతులెత్తేస్తారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్ష కడితే.., మరో సంఘటనలో సీఎం పేరు మర్చిపోయినందుకు ఇంకో హీరోని జైలుకు పంపిస్తారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు మీకు నచ్చినోళ్లు అయితే టికెట్ ధర రూ. 600కు పెంచుకోవచ్చని అనుమతి ఇస్తారా..? ఆపై వారం రోజుల పాటు రేట్లు పెంచుకోవచ్చని రెడ్ కార్పెట్ వేస్తారా..? అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. '50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించు కున్న చిత్ర పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు.' అని ఆయన ఫైర్ అయ్యారు.

**తెర వెనుక ఏ రాజ్యాంగేతర శక్తి ఉంది..**

సినిమా టికెట్ రేట్ల విషయంలో శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిది.. జీవో ఇచ్చేది ఇంకొకరు.. అని హరీశ్‌రావు అన్నారు. సాక్షాత్తు ఒక క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే.. ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే.. అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరని ప్రశ్నించారు. 'మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో..? ఒక్కో సినిమాకు కమిషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో..?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతాం.' అని ఆయన హెచ్చరించారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**గోదావరిఖని :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక ప్రాంతంలో రూ. 175.92 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌లతో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న 5.14 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సింగరేణి కార్మికుల తరహాలో రూ.కోటి బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నాడు సీఎల్పీ నేతగా పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టాలు తెలుసుకున్నానని పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తు కోసం కార్మిక సంఘాలు, ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం పనులు త్వరలోనే చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# ఏదో ఒక రోజు కేరళలో అధికారంలోకి వస్తాం

## కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



**తిరువనంతపురం :** ఏదో ఒక రోజు భాజపాకు చెందిన నేత కేరళకు సీఎం అవుతారని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. భాజపాకు తిరువనంతపురం కీలక మైలురాయని అభివర్ణించారు. ఇటీవల తిరువనంతపురం నగరపాలక ఎన్నికల్లో 50 స్థానాలతో భాజపా విజయభేరి మోగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అక్కడ ప్రతినిధులను కలిసి.. కేరళ అభివృద్ధికి తమ పార్టీ అమలు చేయబోయే భవిష్యత్తు ప్రణాళికలపై షా ప్రసంగించారు. "ఈ విజయంతో మన లక్ష్య సాధనకు ఓ ముందడుగు పడింది. మన పార్టీకి చెందిన వ్యక్తి ఏదో ఒక రోజు సీఎం అవ్వడం ఖాయం. కేరళను పూర్తిగా అభివృద్ధి చేయడంతో పాటు జాతి వ్యతిరేకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటం ఎన్డీయే నేతృత్వంలోనే జరుగుతుంది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం ప్రధాని మోదీ ఆశయం. అది కేరళ అభివృద్ధితోనే సాధ్యమవుతుంది' అని అమిత్ షా ఉద్ఘాటించారు. అలానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతోందని, మరోవైపు దేశంలో కాంగ్రెస్ కూడా కనుమరుగవుతోందన్నారు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న వామపక్ష పాలనకు ఎదురుదెబ్బ తగిలింది. 101 వార్డుల్లో ఎల్డీఎఫ్ 29 గెలవగా, భాజపా నేతృత్వంలోని ఎన్డీయే 50 స్థానాల్లో విజయం సాధించింది.



# 'గ్రోక్' అసభ్య కంటెంట్ వ్యవహారం..

## 600 ఖాతాలు డిలీట్

**న్యూఢిల్లీ :** 'ఎక్స్'లోని ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను వాడి కొందరు అసభ్య, అశ్లీల, చట్టవిరుద్ధ కంటెంట్‌ను సృష్టిస్తున్నారంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఆ కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎక్స్ చర్యలు చేపట్టింది. 3500 పోస్టులను బ్లాక్ చేయడంతోపాటు 600 ఖాతాలను డిలీట్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అలాగే తమ వేదికపై అసభ్యతకు తావివ్వబోమని, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నాయి. మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ అనుసంధానంగా ఉన్న గ్రోక్ సాయంతో ఇటీవల కొందరు అసభ్యకర చిత్రాలు సృష్టించారు. మహిళల ఫొటోలను ఇబ్బందికరంగా మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి పోస్టులను తొలగించాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. అలాగే అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి ఫిర్యాదుల విషయంలో ఆయా సామాజిక మాధ్యమ వేదికలదే బాధ్యత అని స్పష్టం చేసింది. దాంతో గ్రోక్‌లో ఇమేజ్ జనరేషన్ ఫీచర్‌పై ఇప్పటికే 'ఎక్స్' పరిమితులు విధించింది. ఆ ఫీచర్‌ను ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే పరిమితం చేసింది. అంటే డబ్బులు చెల్లించేవారు మాత్రమే ఈ ఫీచర్‌ను ఉపయోగించేలా నిర్ణయం తీసుకుంది. అలాగే తమ వేదికపై పోస్టు చేసిన చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగించడంతోపాటు.. వాటిని అప్‌లోడ్ చేసిన ఖాతాలను డిలీట్ చేస్తామని చెప్పింది. దానిలో భాగంగా తాజా చర్యలు చేపట్టింది.

# వీబీజీ రామ్‌జీ పథకానికి రాష్ట్రాలు నిధులిస్తే తప్పేంటి?

## : రామ్‌చందర్‌రావు



**హైదరాబాద్:** వికసిత భారత్ తమ లక్ష్యమని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీబీజీ రామ్‌జీ చట్టంపై ఆదివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. వీబీజీ రామ్‌జీ అనేది తమ స్వప్నమని చెప్పారు. "దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. వాటిలో భాగంగానే వీబీజీ రామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చారు. అవినీతిని అరికట్టేందుకు పారదర్శకత తీసుకొచ్చేందుకే ఈ కొత్త చట్టం. కానీ, అవినీతి చేసేందుకే కాంగ్రెస్ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తోంది. భాజపా తీసుకొచ్చే ప్రతి పథకాన్ని వ్యతిరేకించడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారింది. రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పుడే బాధ్యత పెరుగుతుంది. వీబీజీ రామ్‌జీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తే తప్పేంటి? మోదీకి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. గ్రామ గ్రామాన తిరిగి కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి"అని పార్టీ శ్రేణులకు రామ్‌చందర్‌రావు పిలుపునిచ్చారు.

# సీఎం కుర్చీ కోసం ఘర్షణల్లేవు

## సీఎం సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఘర్షణలు జరుగుతున్నాయంటూ వస్తోన్న వార్తలపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. అనవసర ప్రశ్నలు అడుగుతున్నారని ఆయన విలేకర్లపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌లో సీఎం కుర్చీకోసం ఘర్షణలు జరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఖండించారు. విద్వేష ప్రసంగాల నిరోధక బిల్లుపై గవర్నర్ థవర్ చంద్ గహ్లోత్‌తో చర్చించనున్నట్టు వెల్లడించారు. ఈ బిల్లు అంశం తనకు, డీకే శివకుమార్ మధ్య చిచ్చురేపిందనడం అవాస్తవమన్నారు. శాసనసభలో బిల్లు ఆమోదం పొందిందని, గవర్నర్ బిల్లును ఆమోదించవచ్చు లేదా వెనక్కు పంపవచ్చు అని పేర్కొన్నారు. అల్లర్ల ఘటనపై బళ్లారి నుంచి బెంగళూరు వరకు పాదయాత్ర చేస్తామన్న భాజపా ప్రకటనపై ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు. గతంలో తాము చేసిన పాదయాత్రకు బలమైన కారణం ఉందన్నారు. రాష్ట్రంలో బొగ్గు గనుల అక్రమ తవ్వకంపై 2010లో కాంగ్రెస్ తరఫున 320 కిలోమీటర్లు పాదయాత్ర చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీని ఫలితంగా 2013లో కాంగ్రెస్ మెజారిటీతో గెలిచిందన్నారు.

## దేవేందర్‌నగర్ కాలనీ ఎన్నిక చెల్లదు

### కాలనీ ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** ఒక వర్గం తన ఇష్టానుసారం కాలనీ ప్రధాన కార్యదర్శికి ఎలాంటి సమాచారం లేకుండా కాలనీ ఎన్నికలకు వెళ్ళడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఈ ఎన్నిక చెల్లదని దేవేందర్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్ స్పష్టం చేశారు. బోడుప్పల్ సర్కిల్ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా జరిగిన ఈ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, సరైన నోటీసులు ఇవ్వక పోవడం వంటి లోపాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలు ప్రజల ప్రజ్ఞాపరమైన ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా మారుతాయని, అందుకే ఈ ఎన్నికలు చట్టబద్ధం కాదని ఆయన నొక్కి చెప్పారు.



## ముత్తిరెడ్డిగూడెం స్కూల్లో వాలీబాల్ టోర్నమెంట్

### ప్రారంభించిన సర్పంచ్ బొడుగే బాలరాజ్

**మోటకొండూర్, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సర్పంచ్ బొడిగే బాలరాజ్ ఆధ్వర్యంలో మోటకొండూర్,ఆత్మకూర్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోటకొండూర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గంగాపురం మల్లేష్. చాడ సర్పంచ్ ఆకుల శ్రీను. వివిధ గ్రామాల ఉపసర్పంచులు గ్రామ పెద్దలు గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.



## వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా నివాళులు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** వడ్డే ఓబన్న తమ సాహిత్యం, సామాజిక చైతన్యంతో ప్రజల్లో అవగాహన కల్పించిన ప్రముఖ వ్యక్తి. ఆయన ఆలోచనలు, రచనలు నేటికీ ప్రేరణగా నిలుస్తాయని మాజీ సాగునీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింలు అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా 263 వ డివిజన్ తెల్లాపూర్ లో ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబన్న అభిమానులు వక్తలు మాట్లాడుతూ, అయన ఆశయాలను స్మరించుకుని, సమానత్వం–న్యాయం–మానవత్వం విలువలను ఆచరించుకుందాం అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. 263 తెల్లాపూర్ డివిజన్ గ్రామంలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం పెద్దలు మాట్లాడుతూ, వడ్డే ఓబన్న తెల్ల దొరల పైన పోరాటం, తెల్ల దొరల గుండెల్లో నిద్రపోయిన వడ్డే ఓబన్న, ఆయన చరిత్ర ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకల్లో పొందపరచాలని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర రాష్ట్ర సంఘం ఒకటే ఉండాలని ఎవరికివారు ఇష్టం వచ్చినట్టు నాదో రాష్ట్ర సంఘం నీదో రాష్ట్ర సంఘం అని పేరుతో రాష్ట్ర వడ్డెర బిడ్డలను మభ్యపెడుతూ ప్రచారం చేసుకుంటున్నారు. తెలంగాణ వడ్డెర రాష్ట్ర నాయకుల్లారా ఒక్కసారి ఆలోచించండి ఎస్టీ సాధన కోసం అందరం ఏకమై తెలంగాణ రాష్ట్రంలో ఒకే వడ్డెర సంఘాన్ని ఏర్పాటు చేయండి, లేకుంటే ఎస్టి సాధన కలగానే మిగిలిపోతుందని సంఘం నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండల పరిధిలోని పల్లెర్ల. సిద్దాపురం గ్రామాలకు చెందిన పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి ప్రజా పాలన ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి . ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో గండు రాణి, మంటిపెల్లి ఐలమ్మ ,కొమిరి పెంటమ్మ కి పల్లెర్ల సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులులి అందజేయడం జరిగింది కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బందెల వీరస్వామి. సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తువుల ఎల్లయ్య పాల్గొన్నారు.



## నర్సాపురంలో బీర్ల అయిలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ

**వలిగొండ. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాపురం గ్రామంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నూతన సంవత్సరం క్యాలెండర్ ను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో కావటి లింగస్వామి యాదవ్, ఏనుగుల ఉప్పలయ్య ,కల్లూరి రమేష్,వలమాల శ్రీను,ఎండి జాకీర్, ఓర్సు ముత్యాలు, ఏనుగుల రమేష్, కావటి నరేష్, మధు, మహేష్,దేవనర్స్,సైదులు, శేఖర్,వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో అంగరంగ వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు


- ముగ్గులను సందర్శించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడలో బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. రంగురంగుల ముగ్గులతో ప్రాంతం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ ముగ్గుల పోటీలను మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి సందర్శించి పాల్గొన్న మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లోని కళాత్మకతను ప్రోత్సహించడంతో పాటు, ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలతో రూపొందించిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు.

- మొదటి బహుమతి 10,000 నగదు – ఆనంత లక్ష్మీ, ప్రసన్న
- రెండవ బహుమతి 6,000 నగదు – సంధ్య, సరిత
- మూడవ బహుమతి 3,000 నగదు – జి. లక్ష్మీ, నిహారిక

ఈ బహుమతులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి చేతులమీదుగా విజేతలు అందుకున్నారు. అలాగే 10 మందికి 1,000/- కన్సలేషన్ బహుమతులు, మరో 20 మందికి ఐటీసీ సంస్థ ద్వారా ప్రత్యేక బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇలాంటి అవకాశం కల్పించిన నాయకులకు, నిర్వాహకులకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాదవి, రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, శ్యామల సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, ఆంజనేయులు, బాలరాజు, జగన్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునుకుంట్ల కిరణ్ గౌడ్, పాశం నరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సతీష్ గౌడ్, అశోక్, శేఖర్, ప్రవీణ్ రెడ్డి, బుల్లెట్ శంకర్, ఉపేందర్, వరికల శ్రీనివాస్, కిరణ్ నాయక్, జిలాని పాషా, పింగళి జోగిరెడ్డి, అమర్ పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.





## రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి : గట్టు శ్రీనివాసాచార్యులు

### త్వరలోనే రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం

**హైదరాబాద్ రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యుల సమక్షంలో అర్చక జేఏసీ నాయకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించడం జరిగిందని తెలిపారు. గౌరవ సలహాదారులుగా రామశర్మ, గౌరవ అధ్యక్షులుగా గంగు సత్యం, ఉపాధ్యక్షులుగా మంగళగిరి తిరుపతా చార్యులు, ఎం.సి. హెచ్. రాఘవా చార్యులు, కార్యదర్శిగా రాజేశ్వర శర్మ, సంయుక్త కార్యదర్శిగా రిపుంజయ శర్మ, వారు నంది నాగరాజుశర్మలను నియమించి వారికి నియా మక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస చార్యులు మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పరిచి అన్ని జిల్లాలలో అధ్యక్ష ఉపాధ్యక్షులు నియమించి ఆలయ అర్చకుల సమస్యలను తెలుసుకొని వారి యొక్క సమస్యల పరిష్కారానికి సమన్వయంతో మేము అందరం కలిసి పని చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉండే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయాలలో అర్చక విధులు నిర్వహిస్తున్నటువంటి అర్చకులు అందరూ కూడా వారి యొక్క సమస్యలు ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకువస్తే మేము పై స్థాయి సినిమా ఉపేంద్ర శర్మ సమక్షంలో మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.





## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన శ్రీను కిడ్నీ సంబంధిత వ్యాధి తో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ,ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన చికిత్స చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించారు. బీర్ల అయిలయ్య ప్రేరణతో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనుకు డయాలిసిస్ చికిత్స కోసం రూ.50,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం వల్ల బాధిత కుటుంబానికి కొంత ఉపశమనం కలుగుతుందని,అలాగే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి తెలిపి శ్రీనుకు మరో అదనంగా రూ.1,00,000/- ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. బీర్ల అయిలయ్య మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఇలాంటి సహాయాలు అందించడం అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు.

# తెల్లాపూర్ మల్లన్న బోనాల జాతర

### పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో బోనాలు జాతర రలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం, మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కండ్లకు కట్టినట్లుగా, ఒగ్గుడోలు వాయిద్యాలు డప్పుల చప్పుల్ల తో శివసత్తుల పూన కాలతో జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం, అని పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి 263 తెల్లాపూర్ డివిజన్ లో ఆదిత్య సమీపం లో పూజారి బొల్లారం లావణ్య శ్రీశైలం ఆధ్వర్యం లో నిర్వహించిన శ్రీ మల్లిఖార్జున స్వామి కల్యాణ ఉత్సవం లో పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అత్యంత వైభవంగా కన్నుల పండుగగా సాగిన ఈ బోనాల ఉత్సవంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్చుడు మల్లేపల్లి సోమి రెడ్డి, తెల్లాపూర్ పాక్స్ ఛైర్మన్ మల్లేపల్లి బుచ్చి రెడ్డి, తెల్లాపుర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రాగం దేవెందర్ యాదవ్,ఉపాధ్యక్చులు నవారి ప్రభాకర్ రెడ్డి, కుర్మ సంగం అధ్యక్చుడు కంజర్ల మల్లేశ్, నీటి సంగం మాజీ అధ్యక్చుడు వడ్డె నర్సింలు, మాజీ కౌన్సిలర్లు కంజర్ల శ్రీశైలం. బాబ్జి, లచ్చిరాం నాయక్, ఉమేష్, శ్రీకాంత్ రెడ్డి, గట్టు పల్లి మల్లేశ్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ యాదవ్. నాయకులు ఐలేష్ యాదవ్. శ్రీదర్ యాదవ్. గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఆదివారం పీఏసీ చైర్మన్ గాంధీ నివాసంలో స్వచ్ఛ తెలంగాణ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ నీ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ... పేద ప్రజల పక్షాన, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ. నిజాన్ని నిర్భయంగా రాస్తూ మంచి పేరును సంపాదించిన "స్వచ్ఛ తెలంగాణ" దినపత్రిక అని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ లో స్వచ్ఛ తెలంగాణ దినపత్రిక ఎడిటర్ ఉప్పరి శేఖర్ సగర, స్టాఫ్ రిపోర్టర్లు, జుట్టు సాయిలు, ఎర్రం శెట్టి సీతారాం, జితేందర్, దుర్గ ప్రసాద్, రఘు, తదితరులు పాల్గొన్నారు.







## సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గ్రామ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ చేతుల మీదుగా ఇంద్రాల జయప్రకాష్, తల మనోజ్ లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడమ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగుల ఆనంద్ యాదవ్, భాస్కర్ రెడ్డి ,నాగుల సందీప్ యాదవ్ ,ఇంద్రాల నరసింహ ముక్తాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## వివేకానందనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ లో ఆర్.ఎన్.సి హాస్పిటల్ డాక్టర్ రమేష్ సౌజన్యంతో తేళ్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తేళ్ల హరికృష్ణ మాట్లాడుతూ.. రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు తమ వంతు కృషిగా తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి గత ఆరు నెలలుగా హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ డివిజన్లో పలుచోట్ల బ్లడ్ డొనేషన్ క్యాంప్, హై టెస్టింగ్ క్యాంప్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది ఐదవ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య శిబిరమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జీఆర్‌బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్ తో పాటు ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న హాస్పిటల్స్ సిబ్బందికి డాక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.





## జర్నలిస్టుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తాం

- ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు
- ఎమ్మెల్యే ఎమ్మెల్సీలను మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గం
- శాలువాతో నూతన కమిటీ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** జర్నలిస్టుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో, వారి సంక్షేమం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును వేర్వేరుగా ఆదివారం వారి నివాస కార్యాలయం వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ లు అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని, ప్రజా సమస్యలను వెలికితీయడంలో వారు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల అభివృద్ధికి, వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలని సూచించారు.
ఈ భేటీలో పాల్గొన్న వారిలో యూనియన్రాష్ట్ర నాయకులు శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలేపాక వెంకట్, మాజీ అధ్యక్షులు సుధీర్ మంకాల, కుత్బుల్లాపూర్ యూనియన్ నూతన గౌరవ అధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణరెడ్డి, అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నాలేటి మాధవరెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, ఉపాధ్యక్షులు బాన్సువాడ వెంకటేష్, సహాయ కార్యదర్శులు జుట్టు సాయి, సూర్య చందర్, కార్యనిర్వాహక కార్యదర్శులు పెంటయ్య, సందీప్, కార్యవర్గ సభ్యులు శ్రీరామ రాజు, పి. శివ, నిరుడి శివ, రవీందర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని వక్తలు కీర్తించారు. ఆ మహనీయుని జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. అదనపు కలెక్టర్ విక్టర్ గారు మాట్లాడుతూ రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. వడ్డె ఓబన్న ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ.సీ సంక్షేమ శాఖ అధికారి జయరాజ్, సహాయ సంక్షేమ అధికారి చక్రధర్, ఒడ్డెర సంఘ నాయకులు ఎల్లయ్య , శ్రీనివాస్, ఆయా సంఘాల ప్రతినిధులు కొత్తపల్లి మల్లయ్య, నాగభూషణం, నరేశ్ ,పవన్, స్వామి, అశ్వాక్ , శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న
## బిజెపిపై పోరాడేందుకు భాగస్వాములుకండి

### రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాడేందుకు జిల్లా రాష్ట్ర దేశవ్యాప్తంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని లేబర్ ఆటో వద్ద ప్రజాసంఘాల పోరుయాత్ర సభను ఆర్ మహిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రను ఉద్దేశించి మాట్లాడుతూ ... లేబర్ కోడ్స్ విబి జి రాం జీ చట్టం జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లు రద్దుకు జరిగే దేశవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక రైతు వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలుగా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని తెలిపారు. ప్రజల హక్కులను కాలరాయడమే కాకుండా రాష్ట్రాల హక్కుల హరించి చట్టాలను చేస్తుందని అన్నారు. ఓవైపు ప్రజా సంక్షేమ వల్లిస్తూ 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చిందన్నారు. చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోట్లను అమలు, విద్యుత్ చట్ట సవరణ చట్టం విత్తన బిల్లు విబిజి రాంజీ చట్టం. భీమా రంగానికి 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి అనురంగంలోకి ప్రవేట్ కంపెనీలకు అనుమతిస్తూ చట్టం చేసిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరు జాతరలో భాగంగా ఆదివారం వికారాబాద్ లో యాత్ర ప్రారంభించడం జరిగింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలలో కార్మికుల రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు వ్యవసాయ కూలీలు ముఖ్యంగా ఈ యాత్ర కదలి రావాలని పిలుపునిచ్చారు. జనవరి 19 తేదీన జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీ ప్రదర్శన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, అధ్యక్షులు బుగ్గప్ప. సిఐటియు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శమయ్య, ఉపాధ్యక్షులు మహిపాల్, కార్యదర్శి సిఐటియు జిల్లా కోశాధికారి బుస చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ కెవిపిఎస్ జిల్లా నాయకులు సతీష్ అక్బర్, నవీన్, మున్సిపల్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు రైతులు తదితరులు పాల్గొన్నారు.





## 21న శిల్పారావంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ ఆదేశాల మేరకు . ఈనెల 21న హైదరాబాద్ శిల్పారావంలో రాష్ట్రవ్యాప్తంగా. నూతన మాదిగ సర్పంచుల ఉపసర్పంచ్ ల సన్మాన కార్యక్రమానికి రావాలని ఈరోజు ఆత్మకూరు మండలంలోని కాప్రాయిపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి ని అలాగే. బీసీ సామాజిక వర్గానికి చెందిన రాగపురం సర్పంచ్ ఎరుకల యతిస్వర్ ను . ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కూరెల్ల రమేష్ మాదిగ. ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి బొట్ల శ్రీనివాస్ మాదిగలు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భైరపాక నాగరాజు మాదిగ. ఎమ్మెస్ ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ కొంపెల్లి వెంకన్న మాదిగజిల్లా ఉపాధ్యక్షులు వెల్మజాల యాదయ్య మాదిగ మండల అధ్యక్షులు వంగపల్లి చిరంజీవి మండల ఇంచార్జ్ బొట్ల అనిల్ మాదిగ మండల ప్రధాన కార్యదర్శి బొట్ల పరమేష్ . మండల యువసేన నాయకులు . ఉప్పల నరసయ్య మాదిగ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు విజ్ఞాన విహారయాత్ర

- చొరవ తీసుకున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- సాలార్జంగ్ మ్యూజియం సందర్శన




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా బాల సదనంలో నివసిస్తున్న 65 మంది అనాథ పిల్లలకు విజ్ఞానంతో కూడిన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పిల్లల్లో సృజనాత్మకత, చరిత్ర, కళలు, సంస్కృతి మానవ పరిణామానికి సంబంధించిన అంశాల పై రియల్-లైఫ్ క్లాస్ రూమ్ అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని ప్రఖ్యాత సాలార్జంగ్ మ్యూజియానికి ఒక రోజు విజ్ఞాన విహారయాత్రను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం 65 మంది అనాథ పిల్లలను సాలార్జంగ్ మ్యూజియానికి పంపించడం జరిగింది. మ్యూజియంలో ప్రదర్శించబడిన అపురూపమైన చారిత్రక కళాఖండాలు, రూపకళా వస్తువులు, పురాతన వస్త్రాలు, ఆయుధాలు, శిల్పకళా నమూనాలు పిల్లలను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్శన ద్వారా పిల్లలు భారతదేశం, ప్రపంచ చరిత్రకు సంబంధించిన విలువైన అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం పొందారు. మ్యూజియం సందర్శన అనంతరం పిల్లలకు సాలార్జంగ్ మ్యూజియం మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో రుచికరమైన భోజనం తో పాటు బహుమతులను కూడా అందజేశారు. మ్యూజి యం సిబ్బంది పిల్లలకు ప్రతి గ్యాలరీ గురించి వివరంగా తెలియజేస్తూ, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇలాంటి విజ్ఞాన విహారయాత్రలు పిల్లల్లో సానుకూల పరిశీల న దృక్పథన్ని పెంపొందించడమే కాకుండా, ఆవిష్కరణ భావనకు బీజం వేస్తాయి. రూపకళా వస్తువులను ప్రత్యక్షంగా చూడడం ద్వారా వారి ఆలోచనా శక్తి విస్తరిస్తుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహిస్తాం అని పేర్కొన్నారు. ఈ విద్యా విజ్ఞాన విహారయాత్ర అనాథ పిల్లలకు కేవలం ఒక ప్రయాణమే కాకుండా, వారి జీవితాల్లో విజ్ఞానం, ప్రేరణ ఆశను నింపిన ఒక మధుర అనుభవంగా నిలిచిందన్నారు.



## షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

### పరామర్శించిన స్థానిక సర్పంచ్ మడకం సుభద్ర

**వాజేడు,రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రం మురుమూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఘనపురం గ్రామానికి చెందిన కుర్సం రాజారాం, నాగమణి దంపతులు నివసిస్తున్నటువంటి పూరిగుడిసె శనివారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. ఈ యొక్క సంఘటన ఎవరు లేని సమయంలో జరిగటంతో ప్రాణ నష్టం జరగలేదు విలువైన పత్రాలు,ఆధార్ కార్డులు, రేషన్ కార్డు భూమికి సంబంధించినటువంటి పాసు పుస్తకాలు, బట్టలు, నిత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని దంపతులు ఇద్దరు విలపించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ మడకం సుభద్ర కాంగ్రెస్ నాయకులు మల్లె దుర్గారావు, దంపతుల ఇద్దర్ని ఓదార్చి జరిగిన ఘటనని ప్రభుత్వానికి వివరించి జరిగిన నష్టానికి నష్టపరిహారం అందించే విధంగా పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిచ్చడి రాఘవులు, చిక్కుడు వెంకటేశ్వర్లు, చిక్కుడు ముత్తయ్య, తాటి శరత్ పాల్గొన్నారు.




## జిల్లా కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

### ఈసన్నపల్లి సర్పంచ్ దోకి లచ్చయ్య

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కురుమ సంఘం నాయకులు సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డ్ మెంబర్ లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జిల్లా కురుమ సంఘం తరఫున ఆదివారం ఘనంగా ఈసన్నపల్లి గ్రామ సర్పంచ్‌గా విజయం పొందిన ధోకి లచ్చయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఇదేవిధంగా కురుమ నాయకులు అన్ని రంగాలలో రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశించి మాట్లాడారు.

## కేవైసీ.. మరింత కఠినంగా

**డిజిటల్ మోసాలు, బినామీ ఖాతాల బెడద పెరిగిపోతుండటంతో బ్యాంకులు తమ నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నాయి. కేవలం ఆధార్ ఓటీపీ (ఈ-కేవైసీ) ద్వారా ఖాతాలను ప్రారంభించే పద్ధతికి స్వస్తి పలుకుతున్నాయి. వీడియో కేవైసీ తప్పనిసరి చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.**




ఇప్పటి వరకూ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా సులభంగా ఖాతాలు ప్రారభించేందుకు వీలుంది. కానీ, ఈ పద్ధతిలో అవతలి వ్యక్తి ఎవరు అనేది బ్యాంకులకు స్పష్టంగా తెలియడం లేదు. ఆధార్ ఈ-కేవైసీ కేవలం ఆ వ్యక్తి వివరాలు ఉన్నాయని మాత్రమే తెలియజేస్తుంది. కానీ, ఆ వివరాలను వాడుతున్నది అసలైన వ్యక్తేనా, కాదా అనేది చెప్పలేదు. దీనివల్ల సైబర్ నేరగాళ్లు వేరే వారి ఆధార్ వివరాలతో మ్యూల్ ఖాతాలను ప్రారంభించి, మోసం చేసి కాజేసిన డబ్బును మళ్లిస్తున్నారు. దీన్ని అడ్డుకునేందుకు బ్యాంకులు ఇప్పుడు వీడియో కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి)ని ఆశ్రయిస్తున్నాయి.
వీడియో కేవైసీని చేసినప్పుడు, కేవలం డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి, ఆధార్ ఓటీపీని నమోదు చేయడంతోపాటు, వీడియోకాల్ ద్వారా బ్యాంకు అధికారులు ఖాతాదారుడితో మాట్లాడుతారు. ఖాతాదారుడు అప్పుడు తన ఆధార్, పాన్‌లాంటివి కెమెరా ముందు చూపించాల్సి ఉంటుంది. అతను/ఆమె ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారో లొకేషన్ రికార్డు అవుతుంది. దీనివల్ల డీప్‌ఫేక్ వీడియోలతో లేదా వేరే వారి ఫొటోలతో మోసం చేయడం కుదరదు.
స్మార్ట్‌ఫోన్ వాడడం రాని గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారుల కోసం బ్యాంకులు అసిస్టెడ్ వీడియో కేవైసీని వినియోగిస్తున్నాయి. దీనిద్వారా ఖాతాదారుడు కుటుంబ సభ్యుల సహాయంతో వీడియో కేవైసీని పూర్తి చేయొచ్చు.
గతంలో వీడియో కేవైసీ లేని ఖాతాలకు పరిమితులు ఉండేవి. వీడియో కేవైసీ పూర్తయిన వెంటనే ఖాతాలు పూర్తి స్థాయిలో పనిచేస్తాయి. ఒకరి పేరుమీద మరొక వ్యక్తి ఖాతాను ప్రారంభించేందుకు వీలుండదు.
బ్యాంకు ఖాతాలో కేవైసీని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఒకసారి బ్యాంకుకు వెళ్లి, మీ వివరాలన్నీ సరిగా ఉన్నాయా? నామినీల పేర్లు నమోదయ్యాయా అనేది తనిఖీ చేసుకోండి.
మీ కేవైసీ గడువు ముగిసింది... వెంటనే ఈ లింక్‌ను క్లిక్ చేయండి అంటూ వచ్చే సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండండి.

సోషల్ మీడియా.. ప్రపంచానికి వేదికగా మారింది. ఎంతో మంది దీనిద్వారా కొత్త నైపుణ్యాలు నేర్చుకుని, ఉన్నత అవకాశాలు పొందుతున్నారు. కానీ, కొంత మంది ముఖ్యంగా విద్యార్థుల విషయంలో ఇదొక వ్యసనంగా మారింది. జీవనశైలిలో అంతర్భాగమైన దీన్ని నివారించడం కష్టమైనప్పటికీ.. సరైన పద్ధతిలో ఉపయోగించుకుంటే చదువులోనూ, కెరియర్ నిర్మాణంలోనూ ఎంతో మేలు చేస్తుంది.




# సరైన పద్ధతిలో వాడితే.. అద్భుత ఫలితాలు..

విద్యార్థుల్లో సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగింది. చాలా మంది ఇందులోనే పూర్తిగా లీనమైపోయి, సమయాన్ని వృథ చేసుకుంటున్నారు. కొంత మంది వ్యసనాలకు బానిసలవుతుండగా, మరి కొందరు సైబర్ మోసాలకూ బలవుతున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. కొన్ని సర్వేల ప్రకారం 69 శాతం టీనేజర్లు తమ భావాలను తెలియజేయడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారు. ఈ అలవాటును చదువు పరంగా మెరుగవ్వడానికి ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.






## సానుకూల ప్రభావం:

ప్రస్తుత విద్యా వ్యవస్థలో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతూ, యూట్యూబ్ మొదలైన వేదికల ద్వారా వీడియో పాఠాలు విని, అర్థం చేసుకోవడం ఎంతో సులువైంది. వీటి ద్వారా వేగంగా సమాచారం తెలుసుకుని నేర్చుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో ఉంటూ, ఆన్‌లైన్‌లో క్లాసులు విని ఉద్యోగాలు పొందినవారూ ఉన్నారు.

## నైపుణ్యాలకు మెరుగులు :

మనకు ఇష్టమైన పనే చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో మంచి పేరు తెచ్చుకోవచ్చు. అజయ్‌కి డ్రాయింగ్ అంటే ఇష్టం. వేసవి సెలవుల్లో స్మార్ట్ ఫోన్ వచ్చాక దానిపై దృష్టి తగ్గింది. అయితే వాళ్ల అమ్మ ఫోన్ వాడకుండా ఆంక్షలు పెట్టినప్పటికీ, దారి మళ్లించ లేకపోయింది. బాగా ఆలోచించి, ఫోన్‌లో నీ డ్రాయింగ్స్ అప్‌లోడ్ చేయి అని సూచించింది. అలా మొదలైన అజయ్ డ్రాయింగ్ పోస్టులకు విశేష ఆదరణ లభించింది. వాటి ద్వారా ఆదాయం పొందుతూ, చదువూ కొనసాగిస్తున్నాడు. దీని వల్ల అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగి, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడంపై దృష్టి సారించాడు.
అనవసరమైన వాటికి ఉపయోగించకుండా.. నైపుణ్యాలు ప్రదర్శించడం, అభిరుచులను వ్యక్తపరచడం, ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవడం, నెట్‌వర్క్ పెంచుకోవడం ఇలాంటి వాటికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవచ్చు.

## ఉద్యోగావకాశాల్లోనూ:

కొన్ని సంస్థలు ఉద్యోగుల ఎంపికలో అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల వివరాలూ అడుగుతున్నాయి. వాటి ద్వారా వాళ్ల నెట్‌వర్క్, ట్రోల్స్, పోస్టులు వారి సొంత బ్రాండ్ ఇలాంటివన్నీ తనిఖీ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఉన్న తీరును బట్టి వారు ఉద్యోగాలకు అర్హులా, కాదా అని నిర్ణయిస్తున్నాయి. మంచి పేరు ఉంటే సంస్థకూ ప్రయోజనమే అని, అలాంటి వారినే ఎంచుకుంటున్నాయి.

## డిజిటల్ అక్షరాస్యత:

బ్రాండ్ మార్కెటింగ్, సోషల్ మీడియా ఎస్ఈవోల గురించి పూర్తిగా తెలుసుకుంటే భవిష్యతుల్లో అనేక అవకాశాలను అందుకోవచ్చు. సోషల్ మీడియా సంస్థలు, వేదికల్లో సేవలూ అందించవచ్చు. మంచి కంటెంట్ అందించినవారు ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారి సంపాదిస్తూ, సంతృప్తినీ పొందవచ్చు.
సోషల్ మీడియాను ఎందుకోసం, ఎలా ఉపయోగిస్తున్నామో కీలకం. దాన్ని ఉపయోగకరంగా మార్చుకుంటే అస్త్రంగా మారుతుంది. అలా కాకుండా వినోద సాధనంగా వాడితే బద్ధకస్తులు, వ్యసనపరులుగా మార్చేస్తుంది. అంతేకాకుండా సైబర్ మోసాలకూ గురికావొచ్చు. మానసికంగానూ ఎంతో ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంది. చదువులోనూ వెనకబడిపోతారు. ఆరోగ్య సమస్యలూ మొదలవుతాయి. కాబట్టి సోషల్ మీడియాను ఉపయోగకరంగా వాడుకోవాలి. అవసరం లేని కంటెంట్ రాకుండా ఫోన్‌ను నియంత్రించు కోవాలి. అటువంటి వాటి జోలికి వెళ్లకుండా మనసును అధీనంలో పెట్టుకోవడం ఎంతో ముఖ్యం.



# కివీస్‌పై భారత్ జోరు





## మెరిసిన కోహ్లి, శుభ్‌మన్, శ్రేయస్
## తొలి వన్డేలో ఘన విజయం

**వడోదర :** న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్ఇండియా శుభారంభం చేసింది. ఆదివారం తొలి వన్డేలో శుభ్‌మన్ సేన 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట డరెల్ మిచెల్ (84; 71 బంతుల్లో 5x4, 3x6), హెన్రీ నికోల్స్ (62; 69 బంతుల్లో 8x4), డెవాన్ కాన్వే (56; 67 బంతుల్లో 6x4, 1x6) రాణించడంతో కివీస్ 8 వికెట్లకు 300 పరుగులు చేసింది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/40) సత్తా చాటాడు. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (93; 91 బంతుల్లో 8x4, 1x6) సూపర్ ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (56; 71 బంతుల్లో 3x4, 2x6), శ్రేయస్ అయ్యర్ (49; 47 బంతుల్లో 4x4, 1x6) రాణించారు. కోహ్లి ఉన్నంతసేపు సాఫీగా సాగుతున్న ఛేదన, అతడి నిష్క్రమణతో కాస్త ఇబ్బందిగా మారినప్పటికీ.. కేఎల్ రాహుల్ (29 నాటౌట్; 21 బంతుల్లో 2x4, 1x6), హర్షిత్ రాణా (29; 23 బంతుల్లో 2x4, 1x6) మెరుపులతో భారత్ గెలిచింది. కివీస్ పేసర్ కైల్ జేమీసన్ (10-1-41-4) గొప్పగా బౌలింగ్ చేశాడు. రెండో వన్డే బుధవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

భారత్ ఛేదన కొంచెం నెమ్మదిగానే ఆరంభమైంది. జేమీసన్, ఫౌక్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 5 ఓవర్లలో టీమ్ఇండియా 15 పరుగులే చేసింది. కానీ తర్వాతి ఓవర్లో రోహిత్ (26; 29 బంతుల్లో 3x4, 2x6) సిక్సర్ బాది స్కోరు బోర్డును కదిలించాడు. జేమీసన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ రోహిత్ సిక్సర్, ఫోర్ కొట్టాడు. అయితే ఊపుమీదున్న అతణ్ని 8వ ఓవర్లో జేమీసన్ ఔట్ చేశాడు. అయినా భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. శుభ్‌మన్‌కు జత కలిసిన కోహ్లి.. ఆరంభం నుంచే చెలరేగి ఆడాడు. గిల్ ఆచితూచి ఆడుతుంటే.. కోహ్లి అలవోకగా బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తొలి 20 బంతుల్లోనే అతను ఆరు ఫోర్లు కొట్టాడు. కుదురుకున్నాక గిల్ కూడా షాట్లకు దిగడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. ముందుగా కోహ్లినే అర్ధశతకం సాధించగా.. తర్వాత గిల్ అతణ్ని అనుసరించాడు. కానీ 50 దాటగానే శుభ్‌మన్.. స్పిన్నర్ అశోక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. గిల్‌తో రెండో వికెట్‌కు 118 పరుగులు జోడించిన విరాట్.. తర్వాత శ్రేయస్‌తో మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశాడు. గాయం కారణంగా రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న శ్రేయస్.. ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. కోహ్లి చకచకా సెంచరీకి చేరువయ్యాడు. 39 ఓవర్లకు 234/2తో భారత్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. అప్పటికి కోహ్లి స్కోరు 93. సెంచరీ లాంఛనమే అనుకున్న దశలో అతను.. జేమీసన్ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. లాంగాఫ్‌లో కెప్టెన్ బ్రేస్‌వెల్ చక్కటి డైవ్ క్యాచ్ అందుకోవడంతో స్టేడియాన్ని నిశ్శబ్దం ఆవహించింది. కోహ్లి వికెట్‌తో ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. అదే ఓవర్లో జడేజా (4)ను కూడా జేమీసన్ ఔట్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో జేమీసన్.. శ్రేయస్‌ను బౌల్డ్ చేసి భారత్‌కు మరో షాకిచ్చాడు. వికెట్లు పడడం, పరుగుల వేగం తగ్గడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6 ఓవర్లలో 44 పరుగులు చేయాల్సిన స్థితిలో కివీస్‌కూ గెలుపుపై ఆశలు రేగాయి. అయితే సుందర్ గాయపడడంతో ముందు బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా కొన్ని షాట్లు ఆడి భారత్‌పై ఒత్తిడి తగ్గించగా.. అతను ఔటయ్యాక రాహుల్ అందుకున్నాడు. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో వరుసగా 4, 4, 6తో అతను మ్యాచ్‌ను ముగించాడు.



**మెరిసిన ఆ ముగ్గురూ..:** మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే 330-340 స్కోరు చేసేలా కనిపించింది. అయితే మధ్య ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడమే కాక, కీలక వికెట్లు పడగొట్టడంతో స్కోరు వేగం తగ్గింది. అయితే ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన డరెల్ మిచెల్.. భారత బౌలర్లకు పైచేయి సాధించే అవకాశమివ్వలేదు. ఓపెనర్లు హెన్రీ నికోల్స్, డెవాన్ కాన్వే పట్టుదలతో క్రీజులో నిలవడంతో తొలి వికెట్ కోసం భారత్ చాలాసేపు ఎదురు చూడాల్సి వచ్చింది. కొత్త బంతితో మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా పొదుపుగా బౌలింగ్ చేయడంతో 9 ఓవర్లకు కివీస్ 40 పరుగులే చేయగలిగింది. అయితే అప్పటికే క్రీజులో కుదురుకున్న ఓపెనర్లు.. తర్వాత బ్యాట్లు ఝుళిపించారు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన ప్రసిద్ధ్ వారిని ఇబ్బంది పెట్టలేకపోయాడు. నికోల్స్, కాన్వే.. సుందర్ వేసిన 20వ ఓవర్లో వరుస బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అప్పటికే జట్టు స్కోరు 100 దాటింది. హర్షిత్ రాణా వరుస ఓవర్లలో కివీస్ ఓపెనర్లను ఔట్ చేయడంతో భారత్ పోటీలోకి వచ్చింది. విల్ యంగ్ (12)ను సిరాజ్, ఫిలిప్స్ (12)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చడం.. మధ్య ఓవర్లలో స్కోరు వేగం కూడా పడిపోవడంతో కివీస్ ఇబ్బందుల్లో పడింది. 36 ఓవర్లకు స్కోరు 186/4. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన మిచెల్.. భారీ షాట్లకు దిగడంతో స్కోరు వేగం పెరిగింది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా అతను మాత్రం ఆగలేదు. ప్రసిద్ధ్ వేసిన 48వ ఓవర్లో 4, 6, 4 బాదిన మిచెల్.. సెంచరీకి చేరువగా వచ్చాడు. జట్టు స్కోరునూ 300కు దగ్గర చేశాడు. అయితే తర్వాతి బంతికి ప్రసిద్ధ్.. వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. క్రిస్టియన్ క్లార్క్ (24 నాటౌట్) పోరాటంతో కివీస్ 300 మార్కును అందుకుంది. 8 ఓవర్లలో 40 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీసిన సిరాజ్‌తో కెప్టెన్ శుభ్‌మన్ పూర్తి కోటా వేయించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. హర్షిత్, ప్రసిద్ధ్ కూడా తలో రెండు వికెట్లు తీసినా.. ఎక్కువ పరుగులిచ్చేశారు.



# ఢిల్లీపై గుజరాత్ విజయం



**ముంబయి :** గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. ఆదివారం భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఆ జట్టు 4 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. సోఫీ డివైన్ (95; 42 బంతుల్లో 7x4, 8x6) రెచ్చిపోవడంతో మొదట గుజరాత్ భారీ స్కోరు సాధించింది. 20 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. గార్డ్‌నర్ (49) రాణించింది. నందని శర్మ (5/33) హ్యాట్రిక్ సాధించింది. ఛేదనలో దిల్లీ 5 వికెట్లకు 205 పరుగులే చేయగలిగింది. లిజెలీ (86; 54 బంతుల్లో 12x4, 3x6), వోల్వార్ట్ (77; 38 బంతుల్లో 9x4, 3x6)ల శ్రమ వృథ అయింది. డివైన్ (2/21) ఆఖర్లో అద్భుత బౌలింగ్‌తో దిల్లీ ఆశలపై నీళ్లు చల్లింది.

**లిజెలీ, వోల్వార్ట్ పోరాడినా..:** లక్ష్యం చాలా పెద్దదే. కానీ ఓపెనర్ లిజెలీ లీ విరుచుకుపడడంతో ఛేదనలో వడివడిగా లక్ష్యం దిశగా సాగింది దిల్లీ క్యాపిటల్స్. రేణుక సింగ్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదాక లిజెలీ కాస్త సమయం తీసుకుంది. పవర్‌ప్లే ముగిసేసరికి షెఫాలి (14) వికెట్ కోల్పోయిన దిల్లీ.. 47/1తో నిలిచింది. ఆ తర్వాత లిజెలీ చెలరేగిపోయింది. వేర్‌హామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 కొట్టిన ఆమె, 33 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసింది. అయితే మరోవైపు వోల్వార్ట్ అంత దూకుడగా ఆడలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరిగింది. 15వ ఓవర్లో లిజెలీని కష్వీ ఔట్ చేసేటప్పటికి దిల్లీ స్కోరు 131. లిజెలీ.. వోల్వార్ట్‌తో రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. ఆఖరి అయిదు ఓవర్లలో దిల్లీకి 77 పరుగులు అవసరమయ్యాయి. కానీ షినెలీ ఔటైనా.. వోల్వార్ట్ విధ్వంసంతో 19 ఓవర్లలో 203/3తో నిలిచింది దిల్లీ. 18వ ఓవర్లో 19.. 19వ ఓవర్లో 22 పరుగులు వచ్చాయి. వోల్వార్ట్‌తో పాటు జెమీమా (15) క్రీజులో ఉండగా.. ఆఖరి ఓవర్లో కేవలం 7 పరుగులు చేయాల్సిన స్థితిలో దిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ సోఫీ డివైన్ (2/21) బంతితోనూ గొప్పగా రాణించింది. 20వ ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసింది. కేవలం 2 పరుగులే ఇచ్చిన ఆమె.. జెమీమా, వోల్వార్ట్‌లను ఔట్ చేయడం ద్వారా గుజరాత్‌కు అనూహ్య విజయాన్నందించింది.

రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక





## ది రాజా సాబ్ కోసం ప్రభాస్ రెమ్యూనరేషన్ ఎంత?

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన లేటెస్ట్ మూవీ ది రాజా సాబ్. సంక్రాంతి కానుకగా జనవరి 8వ తేదీన ఈ సినిమా రిలీజ్ అయింది. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా జనవరి 9వ తేదీన రిలీజ్ కావాల్సి ఉండగా, ఒకరోజు ముందుగానే ప్రీమియర్లు పడిపోయాయి. చాలా రోజుల తర్వాత ప్రభాస్ సినిమా రావడంతో జనాలు ఎగబడి చూస్తున్నారు. మిక్స్ టాక్ వచ్చినప్పటికీ కలెక్షన్స్ మాత్రం అదరగొడుతోంది ఈ సినిమా. మారుతి దర్శకత్వంలో వచ్చిన ది రాజా సాబ్ సినిమా కోసం ప్రభాస్ రెమ్యూనరేషన్ తక్కువగానే తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. టాలీవుడ్ ప్రముఖుల సమాచారం ప్రకారం, ఒక్క సినిమాకు రూ.150 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటాడట ప్రభాస్. కానీ, ది రాజా సాబ్ సినిమాకు మాత్రం కేవలం రూ.100 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు టాక్ నడుస్తోంది. జోనర్ చేంజ్, సెట్ కోసం భారీగా ఖర్చయిన నేపథ్యంలో రెమ్యూనరేషన్ తక్కువగా తీసుకోవాలని ప్రభాస్ నిర్ణయం తీసుకున్నారట. ఇక అటు ఈ సినిమా దర్శకుడు మారుతి రూ.18 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు చెబుతున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ రూ.5 కోట్లు తీసుకోగా, రిద్ధి కుమార్ ఏకంగా మూడు కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మాళవిక రెండు కోట్లు కాగా నిధి అగర్వాల్ కు రూ.1.5 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. ఈ సినిమా బడ్జెట్ రూ.450 కోట్లు దాటినట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది.

## లేకుంటే నేను ఇండస్ట్రీకి వచ్చేదాన్ని కాదు

'గద్దలకొండ గణేష్ల సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ డింపుల్ హయాతి. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ స్టార్ స్టేటస్ మాత్రం అందుకోలేకపోయింది. చెప్పుకోదగ్గ భారీ హిట్ లేకపోవడంతో, కెరీర్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. అయినప్పటికీ అమ్మడుకి అవకాశాలకు ఏం కొదవలేదు. బలమైన రీఎంట్రీ ఇవ్వాలనే లక్ష్యంతో ఇప్పుడు రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్‌తో పాటు డింపుల్ హయాతి హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న డింపుల్ హయాతి తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. "దాసరి నారాయణ రావు గారు మా తాతగారు. అలాగే ఒకప్పటి హీరోయిన్ ప్రభ గారు మా నాన్నమ్మ అవుతుంది. మా కుటుంబంలో చాలా మంది యాక్టర్స్ ఉన్నారు. అయితే నేను సినిమాల్లో వస్తానంటే మాత్రం అంగీకరించలేదు. కానీ నటనపై నాకు ఉన్న ఆసక్తి చూసి నాకు సపోర్ట్ చేశారు. లేకుంటే నేను ఇండస్ట్రీకి వచ్చేదాన్ని కాదు. అతి కష్టం మీద ఒప్పించాను" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు షాక్ అవుతున్నారు.



## నేను ఒంటరిగా ఉన్నప్పుడు చూస్తాను

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'నారి నారి నడుమ మురారి' . సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ , సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమా సంక్రాంతి స్పెషల్‌గా జనవరి 14న థియేటర్లలో రిలీజ్ కానుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన హీరోయిన్ సంయుక్త వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిన్నది మాట్లాడుతూ.. 'నేను ఒంటరిగా ఉన్నప్పుడు సిరీస్ చూస్తాను. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ అంటే నాకు చాలా ఇష్టం.. ఏదైనా సిరీస్ నచ్చితే అది అయిపోయే వరకు అలాగే చూస్తుంటాను. ఇక రీసెంట్‌గా వచ్చిన వెడ్‌నెస్ డే సిరీస్ నాకు బాగా నచ్చింది. అలా నచ్చినవి చూస్తుంటాను. అయితే ఫైటింగ్ సీన్స్, ఫీలింగ్స్ ఉండే సిరీస్ అంటే నాకు చాలా ఇష్టం' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com